తీరనున్న తాగునీటి సమస్య

- జీర్‌పూర్ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు మోక్షం
- రూ. 3.70 కోట్ల నిధులు మంజూరు



బీర్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న భారీ రక్షిత మంచినీటి పథకం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలకు తాగునీటి సమస్య తీరనుంది. బీర్‌పూర్ శివారులోని భార రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు మోక్షం లభించింది. దాదాపు 8 ఏళ్లగా మూలకు పడిన ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వం రూ. 3.70 కోట్లు మంజూరు చేసింది.

బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం...

మండలంలో తాగునీటి సమస్య తీర్చడానికి దాదాపు 23 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన భారీ రక్షిత పథకం ద్వారా బీర్‌పూర్ మండలంలోని మూడు గ్రామాలు, ధర్మపురి మండలంలోని ఆరు గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేశారు. బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు ప్రాజెక్టుకు 100 హెచ్‌పీల మోటార్లను ఏర్పాటు చేసి, అక్కడి నుండి 2 కిలోమీటర్ల దూరంలో భారీ రక్షిత మంచినీటి పథకానికి చేర్చడానికి ప్రత్యేక పైప్‌లైన్లు, విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి నీరు భారీ రక్షిత మంచినీటి పథకానికి చేరగానే అక్కడ ఇసుక ద్వారా ఫిల్టర్ చేసి ఫ్లోరైడ్ రహిత శుద్ధజలంగా మార్చి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల్లోకి సరఫరా చేసేవారు. 2014లో తెలంగాణ ప్రభుత్వం మిషన్‌భగీరథ చేపట్టిన తరువాత ఈ పథకం పూర్తిగా మూతపడిపోయింది. మిషన్‌భగీరథ పైప్‌లైన్లు వేసే సమయంలో భారీ రక్షిత మంచినీటి పథకానికి చెందిన పైప్‌లైన్లు పాడైపోయాయి. దీనికి తోడు రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణలో విద్యుత్ మోటార్లు, కరెంట్ లైన్లు, పథకానికి వచ్చే పైప్‌లైన్లు పూర్తిగా తొలగించారు. దీంతో భారీ రక్షిత మంచినీటి పథకం పనిచేయకుండా పోయింది.

బీర్‌పూర్ మండలంలో తాగునీటి పరిస్థితి.

మండలంలో మిషన్‌భగీరథ పనులు ప్రారంభించి కొన్ని గ్రామాల్లో పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యలతో మండలంలో పూర్తి స్థాయిలో మిషన్‌భగీరథ నుంచి ప్రజలకు తాగునీరు అందించకలేకపోయారు.

పునరుద్ధరణకు చర్యలు

బీర్‌పూర్ మండలంలోని మొత్తం 15 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారానికి భారీ రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించాలని మండల ప్రజలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించగా, రూ. 3.70 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా.. ఎన్నికల తరువాత టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు.

పునరుద్ధరిస్తే 24 గంటలు శుద్ధజలం



బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరిస్తే మండలంలోని అన్ని గ్రామాలకు 24 గంటల పాటు శుద్ధ జలం అందుతుంది. తాగునీటి విషయంలో చాలా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. రూ.3.70 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షనీయం.

– భైరవేని సత్యనారాయణ, బీర్‌పూర్

రసాయనాలు లేకుండా శుద్ధజలం అందుతుంది



రక్షిత మంచినీటి పథకంలో నీరు ఇసుకలో ఫిల్టర్ కావడంతో ఎలాంటి రసాయనాలు వాడకుండా ఇళ్లకు శుద్ధజలం చేరుతుంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలు భారీ రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. వెంటనే పనులు ప్రారంభించి ప్రజలు శుద్ధ జలం అందించాలి.

– మసర్తి రమేశ్, ఎంపీపీ, బీర్‌పూర్

క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ధార్మిక సంస్థ సభ్యులు

రాయికల్: పట్టణంలోని పోచమ్మగుడి ఆవరణలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం హిందు ధార్మిక సంస్థలు, వివిధ కుల సంఘ నాయకులు చైర్మన్, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పోచమ్మగుడిని అనుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈద్గా వద్ద వసతులు కల్పించాలని కమిషనర్‌కు వినతి

మెట్‌పల్లి: రంజాన్ సందర్భంగా పట్టణంలోని ఈద్గాతో పాటు మసీదుల వద్ద తగిన వసతులు కల్పించాలని కోరుతూ మర్కజీ ఇంతేజామి కమిటీ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఖుత్బొద్దీన్, షకీల్, సాజిద్, యూసుఫ్,బాబుఖాన్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

కథలాపూర్: గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నవీన్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి కథలాపూర్ మండలం దూలూర్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, సైబర్ మోసాలపై ఆట పాటలతో కళాకారులు అవగాహన కల్పించారు.

శ్మశానంలో లాకర్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలి



శ్మశానంలో ఏర్పాటు చేసిన లాకర్లు

రాయికల్: పట్టణంలోని శ్మశానంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హస్తికలు భద్రపర్చడం కోసం ఏర్పాటు చేసిన లాకర్‌ను అన్ని కుల సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు చింత శివకుమార్ తెలిపారు. హస్తికలు భద్రపర్చడం కోసం ప్రత్యేకంగా లాకర్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన గీత కార్మిక నాయకులు



మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు సుభాష్ గౌడ్ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించారు. గీతాకార్మికుల పలు సమస్యలను మంత్రికి విన్నవించామని పార్లమెంట్ ఎన్నికల తర్వాత సమస్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

కొండగట్టు: కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లిలో కమలాకర్ అన్న యువసేన ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ మెడికేర్ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200ల మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డబ్బు జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, గోల్కొండ రాజు, పుంద్ర మధు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

మల్లాపూర్: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సాముహిక కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

జగిత్యాలటౌన్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి చైర్‌పర్సన్ అడువాల జ్యోతి దంపతులు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలకు ఏర్పాటు చేయించాలి

మల్లాపూర్: మండలంలోని సాతారంలో శ్రీ వీరభద్రేశ్వర స్వామి జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు చేయించాలని శనివారం యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేకాధికారి ఇందిరకు వినతిపత్రం అందించారు. వీరభద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలను ప్రతీ ఏటా ఘనంగా నిర్వహించుకుంటున్నామని, వచ్చే నెల 10న స్వామి జాతర ఉత్సవాలను నిర్వహించేందుకు తగిన ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బడె బాలు, రాజేష్, పత్తిపాక నరేశ్, మక్కల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో జీవన్‌రెడ్డి గెలుపు

కోరుట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోందని, నిజామాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినపల్లి సత్యం రావు, మాజీ కౌన్సిలర్ హమీద్ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ప్రజలకు అందించారని గుర్తు చేశారు. ముత్యంపేట షుగర్‌ఫ్యాక్టరీ తెరవడంపై, పసుపు రైతులకు లబ్ధి చేకూర్చే అంశంపై జీవన్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందన్నారు.

మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభం



తులాభారం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఉత్సవ విగ్రహాలను ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గోదావరికి ఊరేగింపుగా తీసుకెళ్లి గంగజలాలతో పుణ్యస్నానాలు చేయించారు.ఆ తర్వాత స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు,అభిషేకాలు,కల్యాణం నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బెల్లంతో తులభారం వేయించి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గుండు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

జగిత్యాలటౌన్: పట్టణంలోని మంచినీళ్లబావి వద్ద చింతకుంట చెరువు పక్కన ఉన్న మడేలేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఇటీవల నిర్మించిన శ్రీగుండు అభయాంజనేయ స్వామి స్థిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి దంపతులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులకు జిందాల్ కంపెనీ ఉపకార వేతనాలు



చెక్కులు అందిస్తున్న శ్రీనివాస్

మెట్‌పల్లి: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులు జిందాల్ కంపెనీ అందజేసే ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఒక్కో విద్యార్థికి రూ.8100 చొప్పున మంజూరు కాగా, దీనికి సంబంధించిన చెక్కులను శనివారం కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కమలాకర్‌రావు, ప్రిన్సిపాల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోషియేషన్ అధ్యక్షుడికి సన్మానం

కథలాపూర్: కోరుట్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌రావును కథలాపూర్ మండలానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ శనివారం సన్మానించారు. ఆయన వెంట వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బోదాస్ నర్సయ్య, సతీశ్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, మామిడిపెల్లి గంగాధర్, హరీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు అందించాలి



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీహరి

మల్లాపూర్: విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని విశ్వతేజస్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు తిరునగరి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్‌లో శ్రీ సరస్వతి హైస్కూల్ ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిదండ్రులు, విద్యార్థులకు అయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులుగానీ, యువతగానీ తల్లిదండ్రులు, గురువుల ప్రాధాన్యతను గుర్తించి వారిని ఎల్లప్పుడు గౌరవభావంతో ప్రేమగా మెలగాలన్నారు. సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా ఎదగాలంటే 5 ముఖ్యాంశాలను పాటించాలని సూచించారు. తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వతేజస్ బృందం నరహరి, కపిల్‌రెడ్డి, రాజమౌళి, శ్రీ సరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ సిరిపురం రవీందర్, ప్రిన్సిపాల్ తోట రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ పాస్ యంత్రంతోనే కొనుగోళ్లు జరపాలి

ఇబ్రహీంపట్నం: ఎరువులను ఈ పాస్ యంత్రం ద్వారానే కొనుగోళ్లు జరపాలని మండల వ్యవసాయ అధికారి దీపిక డీలర్లకు సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మండలంలోని డబ్బాలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల విక్రయాల తీరు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ ధరల పట్టికలు, బిల్లు బుక్కులను పరిశీలించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై నమోదు చేయాలని, ఎరువులు కొంటే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్ పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

మల్లాపూర్: ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు రైతులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి సాయిప్రియ అన్నారు. మండలంలోని చిట్టాపూర్, రేగుంట గ్రామాల్లో శనివారం రైతులతో కలిసి వరి, నువ్వు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా 20–25 రోజులలో నువ్వు పంటను రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, ఆకుతీనే పురుగులు ఆశిస్తాయన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 300 గ్రాములు లేదా డైమిథోయేట్ 60 ఎంల్ లేదా ఎసిఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు నిమ్మల జలందర్‌రెడ్డి, జితేందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నాగులపేట, బతికెపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న అధికారులు

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి, మాదాపూర్, నాగులపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయా గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రత్యేక అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు, వీఓఏ లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని నంచర్లలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. బతికెపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఏపీఎం సమత, కార్యదర్శి మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడిపల్లి: మండంలోని కట్లకుంట లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల సెర్ప్ అధికారులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ యదవ్, వీవో,తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సొసైటీ పరిధి గ్రామాల్లో శనివారం యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కోమన్‌పల్లి, తాళ్ల ధర్మారం, చిన్నకొల్వాయి, రేకులపల్లి, కమ్మునూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి లచ్చయ్య, సీఈవో రాజేందర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని గొర్రెలు మృతి



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

వెల్గటూర్ : వ్యాన్ ఢీకొని గొర్రెలు మృతి చెందిన ఘటన ఎండపల్లి మండలం అంబరిపేటలో జరిగింది. స్థానికుల కథనం మేరకు అంబరిపేట గ్రామానికి చెందిన ఎలుక నర్సయ్య గొర్రెలు మేపుకుంటూ జీవిస్తుంటాడు. శనివారం కూడా అంబరిపేట, పైడిపెల్లి క్రాస్‌రోడ్డుకు సమీపంలో గుట్టకు గొర్రెలు మేపుకోవడానికి వెళుతూ రోడ్డు దాటుతుండగా, దండేపల్లికి వెళ్తున్న పెళ్లి వ్యాన్ వేగంగా అతివేగంగా ఢీకొనడంతో నర్సయ్యకు చెందిన ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ ప్రమాదంలో రూ.70 వేల వరకు నష్టపోయినట్లు రైతు నర్సయ్య ఆవేదన చెందారు. ప్రమాద సమయంలో సుమారు 50 మంది వ్యాన్‌లో పెళ్లికి వెళ్తున్నారు. అదృష్టవశాత్తు వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్ చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్సీ వారితో పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ బనుక శంకర్, మాజీ ఎంపీటీసీ గుర్నాథం లస్మయ్య, నాయకులు మండాడి సాగర్, బూస మల్లేశ్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిసె జితేందర్, మహాంకాళి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలు

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేశారు. చైర్ పర్సన్‌గా బుస నాగమణి, కన్వీనర్ గా హెచ్‌ఎం బెజ్జంకి నితిన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వాటి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అదే విధంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సబంధించిన పనులను అమలు చేయడం, విద్యార్థులకు పాఠశాలల యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు తదితర వాటిని అమ్మ ఆదర్శ కమిటీలు చూసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మ్యాన పవన్‌కుమార్, సరోజ, చామంతి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం చేసిన నిందితుడి అరెస్ట్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో ఓ యువకుడిపై ఈనెల 19న హత్యాయత్నంకు పాలపడిన నిందితుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌ను ఇదే గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి పదునైన ఆయుధంతో హత్యాయత్నానికి పాల్పడడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మేడిపల్లి: భీమారం మండలంలోని కమ్మరిపేటలో శనివారం 165 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సురేఖ తెలిపారు. కార్యక్రమంలో బక్కయ్య, మురళి,పశువైద్యాధికారులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం డివిజన్ కార్యదర్శిగా వెంకటేశ్ యాదవ్

ఇబ్రహీంపట్నం: బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ కార్యదర్శిగా ఇబ్రహీంపట్నంకు చెందిన పంతంగి వెంకటేశ్ యాదవ్‌ను నియమించినట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. నియామక పత్రాన్ని ఆయనకు అందచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మండబేరి నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

బాధితురాలికి స్నేహితుల ఆర్థికసాయం

వెల్గటూర్ : భర్తను కోల్పోయి పుట్టెడు బాధలో ఉన్న తమ స్నేహితురాలికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామానికి చెందిన బోడకుంటి రజితకు ఎక్లాస్‌పూర్‌కు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. దురదృష్టవశాత్తు 15 రోజుల క్రితం రజిత భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. పేద కుటుంబానికి చెందిన రజిత భర్తను కోల్పోవడంతో మరింత కుంగిపోయింది. ఈ క్రమంలో రజితతో కలిసి వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌లో 2007–08లో పదో తరగతి చదవిన స్నేహితులు శనివారం రజితకు 17,300 రూపాయల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఏఎంసీ మాజీ చైర్మన్ రాజీనామా

మెట్‌పల్లి: మాజీ ఏఎంసీ చైర్మన్, బీఆర్‌ఎస్ మాజీ పట్టణాధ్యక్షుడు బర్ల సాయన్నతో పాటు అతని సతీమణి, మాజీ కౌన్సిలర్ భాగీర్థ, మాజీ ఎంపీటీసీ బర్ల వినోద్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శనివారం తెలిపారు. సుదీర్ఘ కాలం పాటు బీఆర్‌ఎస్‌కు సేవలందించానని, తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి సేవలందించాలని నిర్ణయించుకున్నామని సాయన్న పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సాయన్న నివాసానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నందుకు ఆయనను అభినందించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మల్యాల: మండలంలో లాస్య ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆధునిక, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల నృత్యాలు, నాటికలతో పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ జోగినిపల్లి సాయిరాం సుష్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ తెలిపారు. సారంగాపూర్‌లోని 11 కేవీ లైన్ కింద ఉన్న చెట్లపొదలను తొలగించడానికి మండల కేంద్రంలోనే (టౌన్)లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వ్యవసాయ పంపుసెట్లకు సరఫరా ఉంటుందని తెలిపారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: పట్టణంలోని సుల్తాన్‌పురా, రాంనగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

మల్యాల: మండలంలో పదో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాల, తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 571 మంది విద్యార్థులు మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాశారు. పరీక్షలు శనివారంతో ముగియడంతో విద్యార్థులు సంతోషంగా ఇళ్లకు చేరారు.